## క్లుప్తంగా

### ఎరువుల గోదాం తనిఖీ



ఎరువుల వివరాలు అడుగుతున్న అధికారులు

**మేడిపల్లి:** మండలంలోని పోరుమల్ల, కట్లకుంట సొసైటీ పరిధిలోని ఎరువుల గోదాములను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి రామచందర్ స్థానిక మండల వ్యవసాయాధికారి షాహిద్ అలీతో కలిసి తనిఖీ చేశారు. గోదాములలో నిల్వ ఉంచిన యూరియా, డీఏపీ,ఇతర ఎరువుల నిల్వలను పరిశీలించి వాటి రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులను రైతులకు అందించడంలో సొసైటీలు ప్రముఖ పాత్ర వహించాలన్నారు. రానున్న రబీ సీజన్ కోసం సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు.

### ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



ఇసుకను పరిశీలిస్తున్న అధికారులు

**కథలాపూర్:** అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్‌శాఖ ఏడీ జైసింగ్ అన్నారు. శనివారం కథలాపూర్ మండలం సిరికొండ శివారులో గల వాగును మండలాధికారులతో కలిసి పరిశీలించారు. సిరికొండ, తక్కళ్లపెల్లి వాగుల్లో నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతుందని ఇటీవల ఫిర్యాదులు వస్తున్నాయని, ఇసకను అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ వినోద్, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, సుదర్శన్, ఆర్ఐ నగేశ్ ఉన్నారు.

### రేషన్ కార్డులు జారీ చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**ధర్మపురి:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రేషన్ కార్డుల ప్రక్రియను త్వరగా జారీ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం డిప్యూటీ తహసీల్దార్ సుమన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చెందోలి శ్రీనివాస్ మాట్లాడుతూ .. గత ప్రభుత్వం రేషన్ కార్డులను జారీ చేయక పోవడంతో లక్షలాది మంది నిరుపేదలు నిత్యావసర వస్తువులకు దూరంగా ఉన్నారని కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీ ప్రక్రియను త్వరగా చేపట్టి పేద ప్రజలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పులి ప్రేమిత్, భీమయ్య, రాజయ్య, దుర్గయ్య తదితరులు ఉన్నారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**గొల్లపల్లి:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని చైల్డ్ మ్యారేజ్ కో–డైరెక్టర్ రాంబాబు అన్నారు. శనివారం గొల్లపల్లి మోడల్‌స్కూల్‌లో నెహ్రూ యువ కేంద్రం, ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అమ్మ పేరు మీద ఒక చెట్టు (ఏక్ పేడ్ మా కే నామ్)కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భూమేశ్, ప్రిన్సిపల్ రవికుమార్, వలంటీర్ మారం గణేశ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### ఎల్‌వోసీలు అందజేత

**జగిత్యాల:** పట్టణంలోని టీఆర్‌నగర్‌కు చెందిన చిట్యాల మురళీ తుంటి ఎముక సమస్యతో బాధపడుతుండగా ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో స్థానిక కౌన్సిలర్ చాంద్‌పాషా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే నిమ్స్‌లో శస్త్ర చికిత్స నిమిత్తం రూ.లక్ష ఎల్‌వోసీ అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

**రాయికల్:** మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన మంత్రి హనీశ్విత్ అనే బాలుడికి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, ఈ విషయాన్ని సింగిల్ విండో చైర్మన్ ముత్యంరెడ్డి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా సీఎంఆర్‌ఎఫ్‌నుంచి శనివారం బాలుడి శస్త్ర చికిత్స నిమిత్తం రూ.1.35 లక్షల ఎల్‌వోసీని కుటుంబ సభ్యులకు అందజేశారు.

**గొల్లపల్లి:** మండలంలోని చిల్వ కోడూర్ గ్రామానికి చెందిన మెంగు రాజేశ్ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల కోసం రూ.3.20 లక్షల విలువ గల ఎల్‌వోసీని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం అందజేశారు.

# కోతలు లేకుండా ధాన్యం కొనాలి

• కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

**ఇబ్రహీంపట్నం:** రైతులకు ఎలాంటి కొతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో, అమ్మక్కపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు మోసపోయారని, రైతు రుణమాఫీ కాలేదని, రైతు భరోసా ఎగ్గొట్టారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో కరోనా కష్టకాలంలోనైనా రైతుబంధు ఇచ్చామని తెలిపారు. రైతులు పండించిన వరిధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, నేడు మాట మార్చి సన్న రకానికే బోనస్ ఇస్తామని అంటున్నారన్నారు. ఇప్పటికైనా రైతు భరోసా ఇచ్చి, రైతు రుణమాఫీ చేసి అన్ని రకాల వరిధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు వేదిక భవనంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి, ఏవో రాజ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ తిమ్మణి రాములు, బీఆర్‌ఎస్‌నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

• ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

**కథలాపూర్:** ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్, సిరికొండ గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేసి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రుణమాఫీ రాష్ట్రంలో 22 లక్షల మంది రైతు ఖాతాల్లో జమ చేశామని, సాంకేతిక కారణాలతో కొందరిఖాతాల్లో జమ కాలేదన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, సీఈవో ఊకోల అరుణ్, సింగిల్ విండో డైరెక్టర్లు గుండారపు గంగాధర్, అంబటి రవి, నాయకులు కాయితి నాగరాజు, తొట్ల అంజయ్య, గడ్డం చిన్నారెడ్డి, పాల్గొన్నారు.

**కోతలు విధించకుండా చూడాలి**

కొనుగోలు కేంద్రాల్లో తూకంలో కోతలు, కొత్త నిబంధనల పేరిట రైతులను ఇబ్బంది పెట్టకుండా చర్యలు తీసుకోవాలని భూషణరావుపేటలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రైతులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతు ఐక్యవేదిక నాయకులు బద్దం మహేందర్‌రెడ్డి, లింగారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న, పీడీ రఘువరన్

**జగిత్యాలరూరల్:** రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని డీఆర్డీఏ పీడీ రఘువరన్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. జిల్లాలో 136 ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా కొనుగోళ్లు చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లెడ సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు, ఎంపీవో రవిబాబు, సివిల్ సప్లై అధికారి వరప్రసాద్, ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, శ్రీనివాస్, ఏఈవో రవళి, రమ్య పాల్గొన్నారు.

**సమన్వయంతో పనిచేయాలి**

**సారంగాపూర్:** ధాన్యం సాఫీగా కొనుగోళ్లు సాగడానికి రైతులతో ఆయా కేంద్రాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ సూచించారు. మండలంలోని రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి, లచ్చనాయక్‌తండా, రంగపేట, పెంబట్ల, కోనాపూర్ గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఏపీఎం రాజయ్యతో కలిసి ప్రారంభించారు. భీంరెడ్డిగూడెం, పోతారం, నాయికపుగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల విండో దత్తాధికారి సాయికుమార్‌గౌడ్ ధాన్యం సేకరణ ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట సీఈవో లైశెట్టి శివ, భూమేశ్ పాల్గొన్నారు.

## ధాన్యం పోయడానికి స్థలం కేటాయించాలని వినతి



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

**సారంగాపూర్:** ధాన్యం పోయడానికి స్థలం లేక రోడ్ల వెంట పోస్తున్నామని, వెంటనే స్థలం కేటాయించేలా చూడాలని మండలంలోని ధర్మనాయక్‌తండా గ్రామ గిరిజన లంబాడాలు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో పాటు, ఉన్నతాధికారులతో మాట్లాడిన ఎమ్మెల్సీ ధర్మనాయక్‌తండా రైతుల ధాన్యాన్ని సారంగాపూర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నారని, ధాన్యం రోడ్ల వెంట పోయడం ద్వారా పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, గ్రామ శివారుల్లో ఖాళీగా ఉన్న స్థలం ధాన్యం పోసుకోవడానికి రైతులకు అనుమతించాలని విజ్ఞప్తి చేయడంతో ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

## డైట్ చార్జీల పెంపుపై సంబరాలు



కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు, టీచర్లు

**గొల్లపల్లి:** ప్రభుత్వం విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం పట్ల గొల్లపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుష్మిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

**సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**

**మల్లాపూర్:** మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ లక్ష్మీప్రియాంక క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర శతక కావ్య పుస్తకావిష్కరణ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న కొండాపూర్ గ్రామస్తులు

**మేడిపల్లి:** మండలంలోని కొండాపూర్ గ్రామ పద్మశాలీ కల్యాణ మండపంలో శనివారం జరిగిన శ్రీ వేంకటేశ్వర శతక కావ్య పుస్తక ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. శ్రీపత్తి రాజన్న ఆధ్వర్యంలో త్రిశతక కర్త రిటైర్డ్ టీచర్, తెలుగు పండితులు శ్రీరామచంద్ర స్వామి ఆలయానికి శతక కావ్య పుస్తకం అంకితమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీపత్తి రాజన్న గారు మాట్లాడుతూ ఇంటర్నెట్ ద్వారా ప్రసార మద్యమాలతో ముందుకు వెళ్తున్న ఈరోజుల్లో పుస్తక పఠనం ద్వారా ప్రజలు సమాజం చాలా జ్ఞానాన్ని పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం కుందారపు లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాజన్న, గడ్డల కైలాసం, విద్యాసాగర్ రావు , రావు గోపాల్ రావు, మనుపాటి బన్న, మాజీ సర్పంచ్ అభిలాష్, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'గంగుల'కు పరామర్శ

**జగిత్యాల:** మాజీమంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తల్లి లక్ష్మీనర్సమ్మ ఇటీవల మరణించగా శనివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కలిసి పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ

**మల్లాపూర్:** మండల డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాస్ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కాగా బదిలీల్లో భాగంగా మల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రావణిని నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఇక్కడికి బదిలీ చేయగా, బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను తహసీల్దార్ వీర్‌సింగ్, ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపి సన్మానించారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**ఇబ్రహీంపట్నం:** మండలంలోని గోధూర్‌లో మాజీ ఎంపీపీ కొటగిరి వెంకటస్వామి తల్లి లక్ష్మి, రెబ్బటి శాంతి తల్లి, కొమటికొండాపూర్‌లో వంగ నారాయణ భార్య ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్, మార్కెట్ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

## రైతులతో మమేకమైనప్పుడే సమస్యలు తెలుస్తాయి

**మెట్‌పల్లిరూరల్:** వ్యవసాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు రైతులతో మమేకమైనప్పుడే పూర్తిస్థాయిలో సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందని కోరుట్ల పశువైద్య కళాశాల అసోసియెట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు.మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ భారతి, ఈఆర్జీ డాక్టర్ ప్రజ్ఞ,విద్యార్థులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి ఆత్మహత్య

**కథలాపూర్:** మండలంలోని ఊట్‌పెల్లి గ్రామానికి చెందిన సుంకరి బుచ్చమ్మ(70) ఎస్సారెస్పీ వరద కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు. బుచ్చమ్మ గత కొంత కాలంలో అనారోగ్యానికి గురై ఇంట్లో ఉంటోంది. చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. మండలంలోని పెగ్గెర్ల గ్రామశివారులో ఎస్సారెస్పీ వరదకాలువలో బుచ్చమ్మ మృతదేహాన్ని గుర్తించారు. మృతురాలి మేనల్లుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

## కొమొరెడ్డి జ్యోతక్క త్వరగా కోలుకోవాలని పూజలు

**మల్లాపూర్:** మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతక్క అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు కట్కం గంగారెడ్డి ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని హన్మాండ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు జవిడి రాజరెడ్డి, నాయకులు చిలివేరి శ్రీనివాస్, నూతిపెల్లి ధర్మరాజు, సాయిలు, గంగరాజం, సంగ సందీప్, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో నీటికొరత తీర్చిన గ్రామస్తులు

**మల్లాపూర్:** మండలంలోని రేగుంటలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు గ్రామస్తులు కలిసికట్టుగా ముందుకు వచ్చి నీటి సమస్య పరిష్కరించారు. పాఠశాలలో ఫిల్టర్ వాటర్ మెషిన్ పాడై పోవడంతో పాటు రిగ్గు మోటార్ చెడి పోవడంతో తాగడానికి, వాష్ రూమ్, ఇతర అవసరాలకు నీటి కొరత ఏర్పడి ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన టీవీఎస్వీ జాతీయ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గనవేని మల్లేష్ నేతృత్వంలో గ్రామస్తులతో కలిసి రూ.21వేల విరాళాలు సేకరించి ఫిల్టర్ వాటర్ మెషిన్, రిగ్గు మోటార్‌ను బాగు చేయించి నీటి సమస్యను తీర్చామన్నారు. పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించినందుకు గనవేని మల్లేష్‌తో పాటు గ్రామస్తులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



**కథలాపూర్:** కోరుట్ల– వేములవాడ రూట్‌లో కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామశివారులో రోడ్డు మలుపు వద్ద తరుచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు జాలువారినట్లుగా ఉండటంతో వాహనాలు స్పీడ్‌గా ఉండి ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ మూలమలుపు వద్ద ప్రమాదాలు నివారించేందుకు రోడ్ల భవనాలశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీకాంత్, రోడ్లు భవనాల శాఖ ఏఈ,కోరుట్ల డివిజన్, సెల్ నంబర్: 9441740616

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

## చెరువు కబ్జా అరికట్టాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**జగిత్యాల:** చింతకుంట చెరువు సమీపంలోని దారిలో ప్రభుత్వ స్థలం ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని మంచినీళ్ల బావి ప్రాంత కుల సంఘాల సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ స్థలం కబ్జా చేయడంతో చింతకుంట మత్తడి నీరు, వర్షపునీరు వెళ్లేందుకు దారిలేక ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోందని, అక్రమ కట్టడాలను వెంటనే అరికట్టాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి కూల్చివేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పంబాల రాము ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

### గెస్ట్ లెక్చరర్లకు వేతనాలు చెల్లించాలి

**రాయికల్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గుర్రాల సాయికృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో 60 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారని, ఐదు నెలల నుంచి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు.

**బీఎస్సీ నర్సింగ్‌కు రాయికల్ విద్యార్థి ఎంపిక**

**రాయికల్:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన భావన బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాజేశ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అధ్యాపకులు రజిత, ఉషారాణి అభినందించారు.

**దరఖాస్తుల ఆహ్వానం**

**రాయికల్:** మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో వంట చేయడం కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

**చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి**

**పెగడపల్లి:** చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మండలంలోని మద్దులపల్లి తాండా అంగన్‌వాడి కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులను క్రమం తప్పకుండా ఎత్తు, బరువు, కొలత చేపట్టి వారి పెరుగుదలను పర్యవేక్షించాలన్నారు. చిన్నారుల ఎదుగుదల, మానసిక స్థితిని ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రజిత పాల్గొన్నారు.

**పశువులకు టీకాలు వేయించాలి**

**జగిత్యాల:** పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ అన్నారు. శనివారం జగిత్యాల మండలం చెర్లపల్లిలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రవి, అనిత, సెక్రటరీ మౌనిక పాల్గొన్నారు.

**బదిలీపై వెళ్లిన ఎంఈవోకు సన్మానం**

**కథలాపూర్:** మండల ఎంఈవోగా పనిచేసి బదిలీ అయిన ఆనందరావును శనివారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. మండలంలో విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరవలేనివన్నారు. పలువురు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంఈవోలు శ్రీనివాస్, నరేశం, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మామిడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పులికాంత శశిధర్, దరందీప్, కృష్ణారావు పాల్గొన్నారు.

**ఘనంగా కార్తీక దీపోత్సవం**

**సారంగాపూర్:** బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక మాసం సందర్భంగా శనివారం హిందూ చైతన్య అఖండ దీపోత్సవం ఆధ్వర్యంలో కార్తీకదీపోత్సవం నిర్వహించారు. తుంగూర్‌లో కార్యక్రమం ప్రారంభించారు. రోజుకో గ్రామంలో మహిళలతో దీపాలను వెలిగించి భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. హిందూ మతాన్ని ప్రచారం చేయడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు.

**బాధిత కుటుంబానికి ఎంపీ పరామర్శ**

**మెట్‌పల్లి:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ కౌన్సిలర్ మర్రి పోచయ్య కుటుంబాన్ని శనివారం ఎంపీ అర్వింద్ పరామర్శించారు. అలాగే బీజేపీ నాయకులు సుంకేట విజయ్, గడ్డం మల్లేశ్‌లను కూడా ఎంపీ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు పల్లె గంగారెడ్డి, డాక్టర్ రఘు, చెట్లపల్లి సుఖేందర్, బొడ్ల రమేష్, నవీన్ తదితరులున్నారు.

**జగిత్యాల:** దీపావళి రోజున అమ్మాజీ డ్రెస్ మెటీరియల్ షాప్‌లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో పూర్తిగా కాలిపోయింది. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి యజమాన్యాన్ని కలిసి పరామర్శించారు.



## లక్ష్మీదేవిపల్లిలో నేలకొరిగిన వరి పంట

**సారంగాపూర్:** మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో కొతకు వచ్చిన పొలాలు నేల కొరిగాయి. అడపాదడపా ఈదురు గాలులతో కూడిన వర్షాలకు పొలాలు నేలకొరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. వర్ష ప్రభావం ఇలాగే కొనసాగితే కోతకు వచ్చిన పొలాలకు మరింత నష్టం వాటిల్లుతుందని రైతులు పేర్కొంటున్నారు.